కొందరు ఋషులు మాత్రమే చెప్పే ప్రత్యేక మంత్రం 'ఆప్తమంత్రం' రుషికేశ్ సమీపంలో ఒక నదీతీరంలోని కుటీరంలో ఒక స్వామి వుండేవాడు. ఆయనను చూడాలంటే కాస్సేపు తాళ్ళ వంతెనపై నడిచి గంగా నదిని దాటి వెళ్ళాలి. ఆ ప్రాంతంలో క్రూరమృగాలు కూడా ఎక్కువగానే తిరుగుతూ వుండేది.

నేనాయన్ని చూడాలని బయలుదేరి వెళ్ళాను. స్వెట్టర్, మఫ్లర్, తలకి తుండు చుట్టుకున్నా నేను చలికి గజగజా వణుకుతున్నాను. నేనాయన్ని సమీపించేసరికి ఆయన అంతటి శీతలంలో కూడా గంగానదిలో స్నానంచేస్తూ కన్పించాడు. అది యోగంవల్ల సాధ్యమవుతుంది. ఆయన స్నానంచేసి వచ్చారు. నేనాయనకి నమస్కరించాను.

ఆయన దీవిస్తున్నట్లు చెయ్యెత్తి ఆశీర్వదించి నన్ను తన కుటీరంలోకి తీసుకెళ్ళారు.

లోపల ఏదో తాళపత్ర గ్రంథాలు, ఆయన సాధన సామాగ్రి తప్ప మరేం లేవు. ఆయన కొద్దిసేపు ధ్యానం చేసుకుని బయటకి వచ్చాడు.

ఆయనకి డెభ్బై ఏళ్ళుంటాయి. నేను చూస్తుండగానే ఆయన చెట్టెక్కాడు. నాకు ఆశ్చర్యం వేసింది. ఆ చెట్టుమీదో తేనెపట్టుంది. ఆయన ఆ తేనెను తీసే ప్రయత్నంలో వున్నాడు. ఆయన పనికి నేను విస్మయం చెందాను.

తేనెపట్టుని కదిలిస్తే తేనెటీగలు కుట్టేస్తాయి. మరితనేమిటి ఇలాచేస్తున్నాడు అనుకున్నాను. అయితే నా అంచనాలను తారుమారుచేస్తూ ఆయన ఏదో మంత్రం ఉచ్చరించి కొమ్మ తుంచి తేనెపట్టుతోపాటు దిగాడు. తేనెటీగలు ఆయన్నేం చేయలేదు. ఆయన తేనెని తీసి నాకిచ్చి, తానూ తాగాడు. అక్కడితో నేనాయనవద్ద సెలవు తీసుకుని వెనుదిరిగాను."

వరప్రసాదం చెబుతున్న విషయాలని శ్రద్ధగా వింటున్నాడు అభిరాం. అతని ముందో క్రొత్త ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నట్లు వరప్రసాదం మళ్ళీ ఇలా తన సంభాషణని కొనసాగించాడు.

"హిమాలయాలలోనే ఒక యోగి ప్రదర్శించిన పరకాయ ప్రవేశాన్ని వీక్షించే అదృష్టం కలిగింది నాకు."

"ఏమిటీ పరకాయ ప్రవేశమా?" ఎంతో ఆశ్చర్యపోతూ అడిగాడు అభిరాం.

"అవును! ఓ యోగి తన శిష్యులకి ఆ విద్యను ప్రదర్శించి చూపుతుండగా అదృష్టవశాత్తు నేనప్పుడు అక్కడే వున్నాను గనుక చూశాను.

ఆ యోగి తన శిష్యులకి ఒక కొయ్య పలకను ఇచ్చి పట్టుకోమన్నాడు. వారు ఆ పలకను పట్టుకున్నారు. 'చూస్తున్నారా నన్ను?' శిష్యులని అడిగాడా యోగి, 'చూస్తున్నాం' అన్నారు వాళ్ళు. నాకంతా అయోమయంగా వుంది.

కాసేపటికి చూస్తుండగానే ఆ యోగి శరీరం మసకబారింది. అది ఆయన శిష్యులవైపు పయనించింది. తరువాత అదృశ్యమైపోయింది కొయ్యపలక బరువెక్కింది. శిష్యులు ఆ పలక బరువు హఠాత్తుగా పెరిగిపోవడంతో మోయలేక కిందకి దించేశారు. 'పలకను వదలకుండా

పట్టుకోండి' యోగి స్వరం అదృశ్య రూపంలోంచే విన్పించింది.

అతిప్రయాసతో శిష్యులా కొయ్యపలకని పైకి లేవదీశారు. పది, పదిహేను నిమిషాల తర్వాత యోగి రూపం అందరిముందూ నిలిచింది.

మనిషికి ఇటువంటి సిద్ధులు యోగం ద్వారా వస్తాయని, ఆ విషయం పతంజలి యోగశాస్త్రంలో వుందని ఆ యోగి తన శిష్యులకి వివరించారు. తరువాత ఆయన సౌర శాస్త్రం గురించి వివరించారు. ఇది సౌర నాడిని ధ్యానించడంవలన వస్తుంది.

మణిపూరక చక్రంపై ధ్యానంవల్ల రోగనివారణ చేసే విద్య అబ్బుతుందని చెప్పాడతను.

ఈ శాస్త్రాన్ని ఉపనిషత్తులు వర్ణిస్తాయని, దీన్ని అభ్యసిస్తే మనిషికి భౌతిక, బౌద్ధిక, ప్రాణిక స్థాయిలలో ఆధిపత్యం లభిస్తుందనీ, ఈ శాస్త్రంలో నిపుణుడైన వ్యక్తి ఎంత దూరంలో వున్నవారికైనా జబ్బులు నయం చేయగలడాయన."

అభిరాం ఊపిరి బిగపట్టి వరప్రసాదం చెప్పే ఆశ్చర్యకర విషయాలు వింటూ ఉద్విగ్నత అంచుకు చేరుకున్నవాడిలా వున్నాడు.

"నా ప్రయాణంలో హిమాలయాలలో 'తుంగనాథ్' అనే ప్రాంతంలో ప్రభాత స్వామి అనే సాధువుని కలిశాను. ఆయనకి ఎనభై ఏళ్ళుంటాయి. ఆయన ద్వారా ప్రేతలోక విశేషాలు తెలుసుకున్నాను.

'శరీరం ధరించిన ప్రతి జీవీ తప్పించుకోలేనిది మరణం సృష్టిలో ముందూ వెనకగా అందరూ తమ దేహాలు విడిచి లోకాంతర గతులు కావలసిందే. చనిపోయాక మనుష్యులకు ప్రేతత్వం పొందటం, యమలోకానికి పోవటం వంటి దశలుంటాయి.

కానీ జంతువులు, పశు, పక్ష్యాదులు, క్రిమికీటకాలు అలాకాదు. ప్రేతత్వమో, పిశాచత్వమో పొందటం మనుష్యులకే కానీ ఇతర జీవులకు లేదు.

చచ్చిన వెంటనే అవి మరొక గర్భంలో ప్రవేశించి జన్మనెత్తుతాయి. స్కాందంలో మహేశ్వర ఖండంలో ఈ విషయం స్పష్టంగా చెప్పబడింది.

పుణ్యాత్ములైన వ్యక్తులు అనాయాసంగా మరణిస్తారు. అంతో ఇంతో పుణ్యం చేసినవాళ్ళు కూడా పదిరోజుల ప్రేతత్వాన్ని తప్పించుకోవటం కష్టం. ఆ తరువాత పుణ్యఫలితంగా ఊర్ధ్వలోకాలకు వెళితే వెళ్ళవచ్చు ఇక పాపాత్ముల సంగతి చెప్పనవసరంలేదు. గరుడ పురాణంలోని ప్రేత ఖండంలో పాపులప్రాణులకు వివిధ గతులు చెప్పబడ్డాయి.

మరణం దగ్గరపడ్డ మనుష్యునికి ఒక క్షణం ఒక యుగంలాగా బాధాభరితంగా వుంటుంది.

నూరు తేళ్ళు కుట్టిన బాధతో నురుగులు కక్కుతూ ముఖం చొంగతో తడుస్తుంటే. పాపాత్ముల ప్రాణాలు ఆసన ద్వారం నుంచి పోతాయి.

జీవుడు హాహాకారం చేస్తూ దు:ఖంతో తన దేహాన్ని చూస్తూనే బయటికి లాగబడతాడు.

ఆ తరువాత వచ్చేది యాతనీ దేహం. అంగుష్ఠ ప్రమాణం గల ఈ జీవుణ్ని యమభటులు పట్టుకుని తమోమయమైన భయంకర మార్గాన యమపురికి తీసుకువెడతారు. అక్కడ యమ భటులు పాపికి నరకయాతనలను పెట్టి యముని ముందు నిలబెడతారు.

యముని ఆజ్ఞచేత మళ్ళీ ఈ జీవి అంతరిక్ష మార్గంలో భూమిపై తన శరీరం దగ్గరకు చేర్చబడతాడు. యమపాశబద్ధుడై, ఆకలిదప్పులతో పీడింపబడి ఏడుస్తూ వుంటాడు.

చనిపోయిన తర్వాత-- జీవుడు శరీరంలోంచి బయటికి వచ్చాక కొన్నిసార్లు, యమదూతలకు పేచీలు వచ్చిన సంఘటనను పురాణాలలో కనిపిస్తూ వుంటాయి. ఎంత పాపాత్ముడైనా ఏ దివ్య క్షేత్రంలోనో మరణిస్తే ఆ జీవికోసం రెండు వర్గాలవారు వాదించుకోవటం, సహజంగా దేవదూతలు ఎక్కువ శక్తి కలవారు కనుక యమదూతలను ఒప్పించి ఆ జీవిని తీసుకెళ్ళటం జరుగుతుంది.

కొన్ని జీవులు కొంతకాలంపాటు స్వర్గానికి, నరకానికి వెళ్ళకుండా అంతరిక్షంలో ప్రేతాలై తిరుగుతూ వుంటాయి. ఆ విధంగా తిరిగే ప్రేతాలే మాంత్రికుల ఆవాహనకు దొరికేది. ఇతర లోకాలకు వెళ్ళిపోయిన జీవులు మాంత్రికులకు దొరకరు.

ఆకాశంలో తిరిగే ఈ ప్రేతాలకు తమ క్రింద వున్న భూలోకవాసులను చూడగల శక్తి మాత్రమే వుంటుంది. తప్ప, పైన మరికొన్ని లోకాలున్నాయన్న సంగతీ, వాటిలో మరింత అధికశక్తి సంపన్నులైన దేవగణాలుంటాయన్న సంగతీ తెలియదు.

మనుషులకి ఏ విధంగా ఇతర జీవులను చూసే శక్తి లేదో ప్రేతములకు కూడా తమ పై లోకములలో వుండేవాళ్ళను చూసే శక్తి వుండదు. ఈ లోకము ఎంత చిత్రమైనదంటే కొందరు దేవుని నమ్ముతారు. దయ్యాలు, భూతాలు లేవంటారు. మరికొందరు వీటిని విశ్వసించి, సర్వశక్తివంతుడైన పరమేశ్వరుని ఉనికిని తెలుసుకోరు. నమ్మరు.

మృతిచెందిన తరువాత అంగుష్ఠమాత్రదేహుడైన జీవుడు తన శరీరాన్ని తాను చూస్తూ, చుట్టూ చేరి అందరూ తనవాళ్ళు దు:ఖిస్తూ వుండగా తాను దు:ఖిస్తూ వుంటాడు. అతనికి పిశాచత్వం రాకుండా వుండటం కోసం సంతానం కర్మచేయాలి.

పది రోజులపాటు చేసే పిండోదశ దానాల వలన మరో శరీరం పుట్టి జీవుడు దాంట్లో ప్రవేశిస్తాడని గరుడపురాణం పలుకుతుంది.

పది రోజుల కర్మ పూర్తయ్యేసరికి హస్త మాత్ర ప్రమాణం గలిగిన దేహంతో పదకొండవ, పన్నెండవ రోజులు ఆకలిదప్పులతో పిండ దానాదులు తింటూ పదమూడవ రోజు యమకింకరుల పాశములచేత కట్టబడి హాహాకారం చేస్తూ ఒక సంవత్సరం ప్రయాణంచేసి యమలోకమైన నరకం చేరుకుంటాడు జీవుడు. తన కర్మసారానుసారం సుఖదు:ఖాలననుభవించి మళ్ళీ భూలోకం చేరి జన్మనెత్తుతుందా జీవి.

'మరి మంత్ర పూరితమైనటువంటి కర్మ చేయబడనివాళ్ళ గతి ఏమిటి? వాళ్ళకు సద్గతులు రావా?" అని ప్రశ్నించాను నేను.

అప్పుడు ప్రభాతస్వామి యిలా బదులిచ్చాడు--

'లోకంలో దరిద్రుడైన వ్యక్తికి ధనవంతుడైన మిత్రుడో, దాతో సహాయం చెయ్యవచ్చు. తాను స్వయంగా సంపాదించినది కాకపోయినా, స్నేహ, దానములద్వారా వచ్చిన ధనాన్ని దరిద్రుడనుభవించినట్లే, స్వయంగా పుణ్యకార్యములు చేయని జీవుడికి కూడా తన పుత్రులు చేసే శ్రాద్ధకర్మల ఫలితంగా ప్రేతాత్మ విముక్తి కలిగి పాపవిమోచనము లభించి కాస్త మంచి స్థితికి పోగలుగుతాడు.

పుణ్యం చేసుకున్న జీవుడికి పుణ్యలోకములు, సద్గతులు ఎలాగూ లభిస్తాయి. తపోనిష్ఠులైన మహర్షులు కనిపెట్టిన అద్భుత ఉపకార పద్ధతి యిది. ఈ మార్గాన్ని అనుసరించి తమని కని పోషించినందుకు పెద్దల రుణాన్ని పిన్నలు తీర్చుకోగలుగుతారు.

కర్మకాండ లేనివారు దానము, శ్రాద్ధము, జల తర్పణము లభింపక ప్రేతరూపమును పొంది నిర్జనారణ్యమునందు బహుదు:ఖితులై కల్పాంతము తిరుగుచుందురు. చేసిన కర్మ అనుభవింపక కోట్ల కల్పములు గడిచినను ఆ జీవుడికి విముక్తి వుండదు. ఏ ప్రాణికైననూ కర్మ అనుభవించకుండా యాతనా దేహము పోదు- మనుష్య దేహము రాదు.

ప్రేతత్వ ప్రారంభదశలో జీవుడు స్వప్నావస్థ వంటి స్థితిలో వుంటాడు. తాను శరీరాన్ని విడిచిపెట్టాను, చనిపోయాను అన్న సంగతి అర్థం చేసుకోవటానికి కొంతకాలం పడుతుంది. ఆ జీవి ఏ స్థితిలో, ఏ కారణం వల్ల మరణించాడో ఆ బాధ, భయము, దు:ఖము వదలవు.

అయితే ఎల్లకాలమూ అలా వుండదు. ప్రకృతి సహజమైన పరిణామం చెంది, మరణాంతరపు తన స్థితిని తెలుసుకోగలుగుతాడు. మనుష్యులను, పాంచ భౌతిక ప్రకృతినీ చూడగలుగుతాడు. తనలాగా గాలిలో తిరిగే ప్రేత జీవులను చూడగలుగుతాడు. వాటితోను మాట్లాడగలడు. అంతవరకే! ఆపైన వుండే జీవులను గురించి అతడికేమీ తెలియదు.

ప్రేతత్వం వదలక తమ పూర్వస్మృతుల కల్లోలపు సుడిగుండాలలో పడి కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యవశులై, తీవ్రస్వభావులై, ఆకలిదప్పికలు, విపరీత వాంఛలతో నియతశక్తి గలిగిన మానవ శరీరం దాటి వాయు శరీరంలో వుండటంచేత వందలరెట్లుగా మనసు సృష్టించుకున్న బాధా, భయము, దు:ఖము వదలవు.

అయితే ఎల్లకాలమూ అలా వుండదు. ప్రకృతి సహజమైన పరిణామం చెంది, మరణాంతరపు తన స్థితిని తెలుసుకోగలుగుతాడు. మనుష్యులను, పాంచభౌతిక ప్రకృతినీ చూడగలుగుతాడు. తనలాగా గాలిలో తిరిగే ప్రేత జీవులను చూడగలుగుతాడు. వాటితోను మాట్లాడగలడు. అంతవరకే! ఆపైన వుండే జీవులను గురించి అతడికేమీ తెలియదు.

ప్రేతత్వం వదలక తమ పూర్వస్మృతుల కల్లోలపు సుడిగుండాలలో పడి కామ, క్రోధ, లోభ, మోహ, మధ, మాత్సర్యవశులై, తీవ్రస్వభావులై, ఆకలిదప్పికలు, విపరీత వాంఛలతో నియతశక్తి గలిగిన మానవ శరీరం దాటి వాయు శరీరంలో వుండటంచేత వందలరెట్లుగా మనసు బయటపడలేక చిత్రవధను అనుభవిస్తూ వుంటాడు.

ఈ దశలో వుండలేక తిరుగుతూ మానవ శరీరం దొరికితే బాగుండునని తపన చెందుతూ ప్రయత్నం చేస్తుంటాడు. బ్రతికి వుండగా తనకు అపకారం చేసిన వాళ్ళకు ప్రత్యుపకారం చెయ్యటానికి, కామవాంఛను తీర్చుకోవటానికి, క్షుత్పిపాసలు పోగొట్టుకోవటానికి మనుష్యులను పట్టుకుని పీడిస్తూ వుంటాయీ జీవులు. అయితే ఆ అవకాశం అందరికీ రాదు.

మరికొంతమంది ఈ భూమిక దాటి సుదూరంగా వున్న నరకలోకానికి వెడతారు.

భూమినుండి అది ఎనభై ఆరువేల యోజనముల దూరంలో వున్నట్లు పురాణాలలో చెప్పబడింది. భూమిని ఆవరించి భువర్లోక, సువర్లోక, మహర్లోక, జనలోక, తపోలోక సత్యలోకములున్నవి.

నరక లోకం భువర్లోకంలోని అడుగుభాగం, భూమికి దక్షిణంగా వుంటుంది. ఆ పక్కనే నైరుతి దిక్కున ప్రేతాలయం వుంటుంది. నరకం లోనికి ప్రవేశించిన జీవులు తాము ఏ పాపములైతే చేశారో ఆ పాపములను బట్టి అక్కడ శిక్షలు పొందుతూ వుంటారు.

ఉదాహరణకు స్త్రీలను హింసించి, తగలబెట్టి చంపినవారికి కొన్ని వందల సంవత్సరాలపాటు అదే హింసా, దహనబాధ అనుభవించక తప్పదు. మానవ శరీరం ఒక పరిమితి దాటితే బాధను భరించలేదు. స్మృతి తప్పటమో, మరణించటమో జరుగుతుంది.

కానీ ప్రేతాత్మ బాధలననుభవించే యాతనా దేహం. దానికి చావులేదు. ఎంత బాధయినా అనుభవించి తీరాల్సిందే.

స్మృతి తప్పటమో, చావటమో అన్న స్థితి ఉదయించదు. పాపానుభవం పూర్తయిందాకా ఈ నరకయాతనను అనుభవించక తప్పదు.

ఇనుప ముక్కుల కాకులు, తప్తతైల కటాహాలు, ఇంగలమున కాగిన మంగలములు పాపులకు ఎదురయ్యే సుసత్యాలు, రౌరవము, మహా రౌరవము, కాల సూత్రము, కుంభీపాకము, అంధలే మిశ్రము, సంహారము మొదలైనటువంటి నరక విభేదాలు.

యమధర్మరాజు దండధరుడై, దంష్ట్రా కరాళవదనుడై, క్రోధ రక్తాంత లోచనుడై దుష్టుల భరతం పడతాడు.

ఈ బాధలన్నీ అనుభవించిన తరువాత పుణ్యమేమైనా వుంటే జీవుడు భువర్లోకపు పై భాగానికి వెడతాడు.

ఈ బాధలను అనుభవించనవసరంలేని జీవుడు నరక భూమికకు రాకుండానే సరాసరి పైకి వెడతాడు.

ఈ భూమికలో లలిత కళాత్మకమైన అనుభూతులెక్కువగా వుంటాయి. సంగీతమో, నాట్యమో, విద్యాధరులు, గంధర్వులు, అప్సరసలు, విందులూ, వినోదాలు, విహారాలు- అంతా ఆనందమయమైన లోకమిది.